క్లుప్తంగా

లక్ష్మీనృసింహ స్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనృసింహ స్వామి

సీతానగరం: మండలకేంద్రంలో సువర్ణముఖి నది ఒడ్డున వెలసిన లక్ష్మీనృసింహ స్వామిని వందలాది మంది భక్తులు గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు పి.శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో అర్చకులు గురువారం ఆలయంలో వేకువ జామునుంచి లక్ష్మీ నృసింహస్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. దూర ప్రాంతాల నుంచి ఉపవాసాలతో వచ్చి పూజల్లో పాల్గొన్న భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు వితరణ చేశారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు


గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై రమణ

పార్వతీపురం: ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని రూరల్ ఎస్సై (క్రైం)ఎస్వీ రమణ హెచ్చరించారు. ఈ మేరకు గురువారం ఆయన పార్వతీపురం మండలంలోని పెదబొండపల్లి గ్రామంలో నేరాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్‌ను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి అల్లర్లు, గొడవలు జరగకుండా ఉండేందుకు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. గ్రామంలో అందరూ వివాదాలకు దూరంగా ఉండి, శాంతియుతంగా మెలగాలని సూచించారు. జిల్లా అంతా 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో గ్రామంలోని మహిళలు, పెద్దలతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం


ఎం.సింగుపురంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ అధికారుల, అంగన్‌వాడీ సిబ్బంది

పాలకొండ రూరల్: బాలికలు రుతుక్రమ సమయంలో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సీడీపీఓ బి. సిమ్మాలమ్మ అన్నారు. మండలంలోని ఎం.సింగుపురంలో ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలతో కలసి గురువారం అవగాహనా ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కిశోరీ బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఆరోగ్యపరమైన ఇబ్బందులు ఎదురైతే తక్షణమే వైద్యసేవలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ పి.దశారత్నం, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- డీఎంఓ జగన్ మోహనరావు


రోగులు, వైద్యసిబ్బందితో మట్లాడుతున్న డీఎంఓ జగన్ మోహనరావు

సీతంపేట: మలేరియా, డెంగీ వంటి సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా నివారణ అధికారి టి. జగన్ మోహనరావు అన్నారు. గురువారం స్థానిక ఏరియా ఆస్పత్రిని సందర్శించారు. జ్వర పీడితుల్లో మలేరియా పాజిటివ్ లక్షణాలున్న వ్యక్తులతో మాట్లాడుతూ, వైద్య సేవలు అందుతున్న వైనంపై ఆరా తీశారు. ఎన్ని మలేరియా కేసులు ఉన్నాయో రికార్డులు పరిశీలించి వైద్యాధికారులతో మాట్లాడారు. అనంతరం ల్యాబ్ తనిఖీ చేశారు. ప్రతిరోజూ నిర్వహిస్తున్న జ్వర నిర్ధారణ పరీక్షలు, వాటి నివేదికలపై అడిగి తెలుసుకున్నారు. రోజువారీ నివేదికలను ఎప్పటికప్పుడు జిల్లా మలేరియా నివారణా కార్యాలయానికి తెలియజేయాలన్నారు. ఏ ప్రాంతంలో జ్వరాలు ప్రబలయో తెలుసుకుని సంబంధిత వైద్యాధికారులను క్షేత్రస్థాయికి పంపించి నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం కుశిమి పీహెచ్‌సీని సందర్శించారు. కార్యక్రమంలో ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, దోనుబాయి పీహెచ్‌సీ వైద్యాధికారి భానుప్రతాప్, ఏఎంఓ సూర్యనారాయణ, కన్సల్టెంట్ శ్రీకాంత్, సబ్‌యూనిట్ ఆఫీసర్ మోహనరావు పాల్గొన్నారు.

జోరుగా ఖరీఫ్ దుక్కులు

- వ్యవసాయ పనులు ప్రారంభించిన రైతులు
- సిద్ధం చేస్తున్న నారుమడులు


సంగంవలస గ్రామంలో నారుమళ్లను సిద్ధం చేస్తున్న రైతులు

పార్వతీపురంటౌన్: మృగశిర కార్తె సమీపిస్తున్న తరుణంలో రైతులు వ్యవసాయ పనులకు సన్నద్ధమవుతున్నారు. ఇటీవల జిల్లాలో కురిసిన చెదురుమదురు వర్షాలకు పొలాల్లోని కుంటల్లో నీరు చేరడంతో నారుమళ్లను సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఖరీఫ్ దుక్కులు జోరుగా సాగుతున్నాయి. ఆర్బీకేల ద్వారా రాయితీపై విత్తనాలను సమకూర్చనున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు ప్రకటించడంతో విత్తనాల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు పంపిణీ చేసేందుకు 29,283 క్వింటాళ్ల విత్తనాలను (అపరాలు, చోడి, వేరుశనగ, వరి) రాయితీపై రైతులకు అందించేందుకు ఆర్బీకేల్లో సిద్ధం చేశామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. 29,283 క్వింటాళ్ల వరి, 9981 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలను షెడ్యూల్డ్ మండలాల్లో గిరిజన రైతులకు 90శాతం రాయితీపై సరఫరా చేయనున్నట్లు తెలిపారు. రాబోయే ఖరీఫ్‌కు వరి సుమారు లక్షా75 వేల ఎకరాల్లో జిల్లాలో సాగుకు సిద్ధం కాగా, ఇందుకు అవసరమైన 26,416 క్వింటాళ్ల విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. గుమ్మలక్ష్మీపురం, కొమరాడ, కురుపాం, జియ్యమ్మవలస పాచిపెంట, సాలూరు, సీతంపేట మండలాల్లో గిరిశిఖర గ్రామాల్లో చిరుధాన్యాల సాగు పెద్దఎత్తున చేపట్టేందుకు గాను, రైతులకు కావాల్సిన దాదాపు 110 క్వింటాళ్ల చిరుధాన్యాల విత్తనాలను 90శాతం రాయితీపై సరఫరా చేసేందుకు సిద్ధం చేసినట్లు అధికారులు తెలియజేస్తున్నారు.

పార్వతీపురం మండలంలో..

మండలంలో 21వేల ఎకరాల విస్తీర్ణం సాగు భూములున్నప్పటికీ 19,300 ఎకరాల్లో వరి సాగవుతుంది. మండలంలోని 19 ఆర్బీకేలకు గాను 15 ఆర్బీకేలకు ఇప్పటికే 1600 క్వింటాళ్ల వరి విత్తనాలను తరలించినట్లు అధికారులు చెప్పారు. బాలగుడబ, నర్సిపురం, పుట్బూరు, పెదమరికి రైతు భరోసా కేంద్రాలకు విత్తనాలను తరలించిన అనంతరం పంపిణీ చేస్తామని తెలిపారు. ఇప్పటికే విత్తనాలు అవసరమైన రైతులను వ్యవసాయ సహాయకులు గుర్తించారన్నారు. ఈ ఏడాది 1064,1121, సోనామసూరి, సాంబమసూరి రకాల విత్తనాలను అందుబాటులో ఉంచామని, భూమిలో సారాన్ని పెంచేందుకు పచ్చిరొట్ట, జీలుగ, కట్టిజనుము 300 క్వింటాళ్ల విత్తనాలను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. రైతులకు అవసరమైన ఎరువులు సిద్ధం చేశామని, పుత్తూరు, తాళ్లబురిడి, ఎమ్మార్‌నగరం, సంగంవలస, ములగ రైతు భరోసా కేంద్రాల్లో కేంద్రానికి 12 టన్నుల చొప్పున యూరియా అందుబాటులో ఉంచామని వివరించారు. వాతావరణ శాఖ సమాచారం ప్రకారం జూన్ మొదటి వారంలో జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో జిల్లా అధికారులు ఇప్పటికే అన్ని మండలాలకు రైతుల అవసరార్థం ప్రభుత్వ నిబంధనల ప్రకారం సరిపడా విత్తనాలను సరఫరా నిమిత్తం అందుబాటులో ఉంచారు. దీంతో విత్తనాలు సేకరించుకుని ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ఆశాజనకంగా ముగించాలని పలువురు రైతులు కోరుకుంటున్నారు.

నిరంతర విద్యుత్ సరఫరాకు ప్రత్యేక లైన్లు


బగ్గందొరవలస వద్ద స్తంభాలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

సీతానగరం: గ్రామాల్లో నిరంతరం విద్యుత్ సరఫరా చేయడానికి కాంట్రాక్ట్ విభాగం అధికారుల పర్యవేక్షణలో ప్రత్యేక విద్యుత్ లైన్లు వేస్తున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ మండల ఏఈ జగన్‌మోహనరావు తెలిపారు. ఈ మేరకు మండలంలోని అప్పయ్యపేట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ గృహోపకరణాలకు వినియోగించే విద్యుత్‌లైన్-వ్యవసాయ పంప్‌సెట్‌లు, పరిశ్రమలకు ఒకేలైన్ కావడంతో ఇళ్ల సర్వీసులున్న వారికి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని వినియోగదారులనుంచి తరచూ ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఈ మేరకు అప్పయ్యపేట, బూర్జ సబ్‌స్టేషన్‌లనుంచి నిర్దేశించిన గ్రామాలకు ప్రత్యేకమైన విద్యుత్ పవర్‌లైన్లు వేస్తున్నట్లు చెప్పారు. త్రీఫేజ్ విద్యుత్‌లైన్లు యథావిధిగా పనిచేస్తాయని, వాటిలో మరమ్మతులకు గురైతే తక్షణమే మరమ్మతులు చేపడతామని తెలిపారు. కాంట్రాక్ట్ ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో జరుగుతున్న పనులు పూర్తయిన వెంటనే గృహావసరాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడానికి ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో చర్యలు చేపడతామన్నారు.

విద్యార్థులకు గ్రామస్తుల అభినందన

బలిజిపేట: 2023-24విద్యా సంవత్సరంలో బలిజిపేట మండలంలోని పెదపెంకి ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. జి.మురళి, సంజీవనాయుడుల ఆధ్వర్యంలో, జి.అప్పలనాయుడు అధ్యక్షతన వారిని సన్మానించారు. పాఠశాలలో ప్రథమ స్థానం పొందిన టి.అఖిల, ద్వితీయ స్థానం పొందిన పి.జ్యోతికలకు మెమెంటోలు అందించి, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ విద్యార్థి దశలో మంచి విద్యను అభ్యసించి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామానికి మంచి పేరుప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రతి విద్యార్థి మంచి తెలివితేటలు కలిగి ఉంటాడని వాటిని సద్వినియోగం చేసుకోవడంలోనే వారి నైపుణ్యం బయటపడుతుందన్నారు. భవిష్యత్తులో మరిన్ని మంచిమార్కులు సాధించి పేరు, ప్రతిష్టలు పొందాలని విద్యార్థులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు టి.నాగేశ్వరరావు, పి.రాంబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే కార్మికుల హక్కుల రక్షణ


సీఐటీయూ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్.రాము


బలిజిపేట ప్రజా సంఘాల కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించిన నాయకులు

సీతానగరం: కార్మికుల హక్కులు పోరాటాలతోనే సిద్ధిస్తాయని అందుకు కార్మికులంతా ఐకమత్యంగా మెలగాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఐద్వా జిల్లా కార్యదర్శి వి.రామలక్ష్మి అన్నారు. సీఐటీయూ 54వ ఆవిర్భావ దినోత్సవం గురువారం మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయం ఆవరణలో ఆమె ఆధ్వర్యంలో జరిగింది. ముందుగా మండల కాంప్లెంక్స్ ఆవరణలో సీఐటీయూ పతాకాన్ని జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్.రాము ఆవిష్కరించారు. అనంతరం ఐద్వాజిల్లా కార్యదర్శి రామలక్ష్మి మాట్లాడుతూ ఎందరో మహనీయులు పోరాటం చేసి కార్మికుల హక్కులు సాధించుకున్న విషయాన్ని గుర్తు చేశారు. అటువంటి పోరాట యోధుల స్ఫూర్తిగా సీఐటీయూను బలోపేతం చేయడానికి అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకుడు రెడ్డి లక్ష్మునాయుడు, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు, భవన నిర్మాణ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు తోలాపు రమేష్, గ్రీన్‌అంబాసిడర్ల సంఘం మండల నాయకుడు జలుమూరు గౌరు, ఐద్వాసభ్యులు పాల్గొన్నారు.

బలిజిపేటలో..

బలిజిపేట: సీఐటీయూ 54వ ఆవిర్భావ దినోత్సవాన్ని బలిజిపేటలోని ప్రజా సంఘాల కార్యాలయం వద్ద గురువారం నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి మన్మథరావు ఈ సందర్భంగా పతాకావిష్కరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1970లో బెంగాల్‌లో మే, 30న సీఐటీయూ ఆవిర్భవించిందన్నారు. నాటినుంచి నేటివరకు కార్మికుల పక్షాన నిలిచి ఎన్నో పోరాటాలు చేసి కార్మికుల సమస్యలపై దృష్టి సారించిందన్నారు. ఐక్యత పోరాటం నినాదంతో రాజీలేని పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో పి.అప్పారావు, ఆటోయూనియన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక హక్కుల పరిరక్షణే సీఐటీయూ ధ్యేయం

సాలూరు: కార్మిక హక్కుల పరిరక్షణే సీఐటీయూ ధ్యేయమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు అన్నారు. సీఐటీయూ 54వ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయుడు మాట్లాడుతూ, కార్మికుల హక్కుల కాపాడడంలో సీఐటీయూ ముందుంటుందని అన్నారు. కార్మికుల హక్కులసాధనకు అందరూ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


సాలూరు: పట్టణంలో నిర్వహిస్తున్న సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం

రుచికరంగా వంటకాలు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ పెంట సత్యనారాయణ

మక్కువ: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం వంటకాలు రుచికరంగా నిర్వహించాలని మండల విద్యాశాఖాధికారి పెంట సత్యనారాయణ కోరారు. ఈ మేరకు స్థానిక వెలుగు మహిళా సమాఖ్య భవనంలో మధ్యాహ్నం భోజన పథకం నిర్వాహకులకు గురువారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మంచి భోజనం అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం పోషకాహారంతో కూడిన మెనూను పాఠశాలలకు అందిస్తోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న మెనూ విద్యార్థులకు క్రమం తప్పకుండా అందజేయాలని స్పష్టం చేశారు. వంటకాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, వంటగది పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శిక్షణాధికారి వై.శాంతకుమారి, ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన తప్పనిసరి

వీరఘట్టం: దైనందిన జీవితంలో ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని యజ్ఞకర్త ఎస్‌వీఎల్‌ఎన్ శర్మయాజీ అన్నారు. గురువారం స్థానిక షిర్డీ సాయిబాబా ఆలయంలో నిర్వహించిన ఆధ్యాత్మిక జ్ఞానసభలో ఆయన మాట్లాడుతూ, నేటి పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్కరూ బాధ్యతలు మరిచిపోతున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఆధ్యాత్మిక భావాలు అలవర్చుకోవడం వల్ల మానసిక ప్రశాంతతతో పాటు మెరుగైన సమాజం ఏర్పడుతుందని చెప్పారు.

ఎంపికైన విద్యార్థుల జాబితాలు సిద్ధం

భామిని: మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్, కాలేజ్‌లో ప్రవేశాలకు సంబంధించి ఎంపికై న వారి జాబితాలు సిద్ధం చేసినట్లు ప్రిన్సిపాల్ ఆర్. శివకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతిలో ప్రవేశాలు పొందిన వారి జాబితా మోడల్ స్కూల్ నోటీస్‌బోర్డులో ప్రచురించినట్లు పేర్కొన్నారు. అలాగే ప్రథమ ఇంటర్ ప్రవేశాలకు సంబంధించిన జాబితాను రిజర్వేషన్ల ప్రకారం తయారు చేసి ప్రదర్శించామన్నారు. జాబితాలో పేర్లున్న విద్యార్థులు జూన్ 1న ధ్రువపత్రాలతో సహా స్కూల్‌లో హాజరుకావాలన్నారు. ఇతర వివరాలకు 94403 22964 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

దోమల నివారణకు మలాథియన్ పిచికారీ


కాశీపట్నంలో స్ప్రేయింగ్ చేస్తున్న దృశ్యం

మక్కువ: మండలంలోని మక్కువ, శంబర పీహెచ్‌సీల పరిధిలోని పలు గ్రామాల్లో వైద్యశాఖ ఆధ్వర్యంలో మలాథియన్ పిచికారీ చురుగ్గా నిర్వహిస్తున్నారు. వైద్యాధికారులు హరికృష్ణ, కిరణ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో మార్కొండపుట్టి, కాశీపట్నం గ్రామాల్లో దోమల నివారణకు గురువారం పిచికారీ నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో తాగి పడేసిన కొబ్బరిబొండాలు ఉంచరాదని, గోలాలు, డ్రమ్ముల్లో నీరు నిల్వ ఉంచడం వల్ల దోమలు చేరి వ్యాధులు ప్రబలే ఆస్కారం ఉందన్నారు. మలేరియా పట్ల ప్రజలు అవగాహన పెంచుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు జగన్‌మోహన్‌రావు, పోలిరాజు, వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లార్వా నిరోధక రసాయనాల పిచికారీ

పార్వతీపురంటౌన్: పట్టణంలో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య స్పెషల్ డ్రైవ్‌ను జిల్లా మలేరియా అధికారి (డీఎంఓ) డాక్టర్ టి.జగన్ మోహనరావు, మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు గురువారం పర్యవేక్షించారు. జగన్నాథపురంలో 29, 30వార్డులలో చేపట్టిన కాలువల్లో పూడికతీత, దోమల లార్వా నివారణ పిచికారీ (ఏఎల్‌ఓ) కార్యకలాపాలను స్వయంగా పరిశీలించారు. దోమల లార్వా వృద్ధి చెందకుండా, దోమల వ్యాప్తిని అరికట్టేందుకు లార్వా నిరోధక రసాయనాలను పిచికారీ చేయించినట్లు చెప్పారు. నీరు నిల్వ ఉండకుండా కాలువల్లో పూడికలు తీయించామని, తద్వారా దోమలు ప్రబలకుండా సీజనల్ జ్వరాలు అదుపులో ఉండేందుకు నియంత్రణ చర్యలు చేపడుతున్నామన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. జిల్లాలో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్‌ను నిర్వహించాలని కలెక్టర్ జారీ చేసిన ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. దోమలపై దండయాత్ర చేసి దోమల వ్యాప్తిని నివారిస్తామని, మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలే పరిస్థితి లేకుండా అన్ని చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఏఎంఓ సూర్యనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మరింత రుచిగా మధ్యాహ్న భోజనం


మధ్యాహ్న భోజనం వంట నిర్వాహకులకు సూచనలిస్తున్న ఎంఈవో చంద్రశేఖర్

గుమ్మలక్ష్మీపురం: ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లలకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం మరింత రుచికరంగా ఉండాలని, ఆ దిశగా వంటల నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని ఎంఈవోలు బి.చంద్రశేఖర్, బి.జనార్దన నాయుడు ఆదేశించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలోని 172 పాఠశాలల మధ్యాహ్న భోజనం వంట నిర్వాహకులతో గురువారం సమావేశమైన వారు.. ప్రముఖ తాజ్ హోటల్ చెఫ్(వంట మాస్టర్)లు చేసే వంటకాల వీడియోలను ప్రదర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ వంటకాలు రుచి, శుచి కలిగి ఉండాలని, వంటకాల తయారీలో తాజ్ హోటల్ వంట మాస్టర్‌లు అనుసరించే విధానాలపై ప్రభుత్వం శిక్షణకు పిలుపునిచ్చిందని, ఈ శిక్షణకు హాజరై, వంటకాలు బాగా వండడంపై నైపుణ్యం సాధించాలన్నారు. పాఠశాలల పునఃప్రారంభమైన తర్వాత ప్రతీ పాఠశాలను సందర్శించి, వంటకాలు రుచి చూసి పరిశీలిస్తామని, ఎక్కడైనా వంటకాలు బాగాలేకపోతే చర్యలు తీసుకుంటామన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

వీరఘట్టం: అంగన్‌వాడీ కేంద్రాలను కార్యకర్తలు సక్రమంగా నిర్వహించాలని సీడీపీఓ బి.సిమ్మాలమ్మ సూచించారు. మండల కేంద్రంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని సూచించారు. అలాగే స్టాకు వివరాలు రికార్డుల్లో నమోదు చేయాలన్నారు.

గ్రామాల్లో పారిశుధ్ధ్య పనులు


బగ్గందొరవలసలో కాలువల్లో పూడికలు తీయిస్తున్న కార్యదర్శి కె శ్రీనివాసరావు


గంజాయిభద్రలో దోమల మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది


పార్వతీపురం టౌన్: పూడికతీత కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో సర్పంచ్‌ల పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్య పనులు నిర్వహించడంతో పాటు కాలువల్లో పూడికలు తీత, దోమల నివారణకు మందు పిచికారీ చేయిస్తున్నట్లు ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు అన్నారు. ఈ మేరకు గురువారం మండలంలోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులు, దోమల నివారణ మందుల పిచికారీ పనులను పరిశీలించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఆదేశాల మేరకు గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. అలాగే కాలువల్లో వాడుక నీరు నిల్వలేకుండా పూడిక తీత చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో చినభోగిలి, లచ్చయ్యపేట, బగ్గందొరవలస గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

సాలూరు రూరల్‌లో..

కలెక్టర్ ఆదేశాలమేరకు సాలూరు మండలంలోని పలు పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు, దోమల నివారణ మందుల పిచికారీ కార్యక్రమాన్ని సచివాలయ సిబ్బంది చేపట్టారు. ఈ మేరకు మండలంలోని మావుడి, పట్టుచెన్నూరు, పగులు చెన్నూరు, గంజాయిభద్ర, కొట్టుపరువు తదితర పంచాయతీల్లో కాలువల్లో పూడిక తీత ఫాగింగ్, దోమల మందు పిచికారీ నిర్వహించారు.

వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు

పార్వతీపురంటౌన్: పట్టణంలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు రానున్న వర్షాకాలం దృష్ట్యా పట్టణంలోని 30 వార్డుల్లో పూడిక తీత కార్యక్రమాన్ని ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్నాథపురం పరిధి 29, 30వ వార్డుల్లో బెరి వీధి, రామాపురం కాలనీ, 20వ వార్డు చర్చి వీధిలో డ్రైయిన్ డీసిల్టింగ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ఇంజినీరింగ్ సెక్షన్ వారితో కాలువలను ఆనుకుని ఉన్న పైప్‌లైన్‌లో లీకులను గుర్తించి తక్షణమే మరమ్మతులు చేయించాల్సిందిగా వార్డు సెక్రటరీలను మున్సిపల్ కమిషనర్ ఆదేశించారు. వేసవి దృష్ట్యా పట్టణంలో తాగునీటి సరఫరా క్రమం తప్పకుండా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డీహెచ్‌ఓ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళి, శానిటేషన్ సెక్రటరీలు పాల్గొన్నారు.